# శివాని

మళ్ళీఫోను మోగుతోంది. ఈ రాత్రి ఇది మూడవసారి. గంట గంటకూ మోగుతున్నట్లనిపిస్తోంది గంగాధరానికి. టైమ్ తెల్లవారుజామున మూడుగంటలు. శివాని పక్కలోనే వణకిపోతోంది. వాళ్ళ నాన్న గంగాధరమే మళ్ళీ ఫోను తీశాడు. అవతలి నుండి అమెరికన్ యాసలో వినిపించింది. "శివానీతో మాట్లాడాలి."

"మీరెవరు?"

"ఇంతకూ మీరెవరు?"

"బాగుంది. మా యింటికి ఫోను చేసి నన్నే ఎవరని అడుగుతావే!"

"ఇది శివాని కాంటాక్ట్ నంబరు కాదా?"

"అయితే?" "ఆమెను మాట్లాడమను. మధ్యలో నువ్వేమిటి పానకంలో పుడకలా"

"వెధవా నువ్వెవరు?"

"ఓ... షటప్" అవతలివాడు ఫోన్ పెట్టేశాడు.

గంగాధరానికి పిచ్చెత్తినట్లుంది. కోపానికీ తక్కువలేదు. పడుకొన్న శివానిని లేపి చెంపలు వాయించాలనిపిస్తోంది. ఇప్పటికి వచ్చిన మూడు కాల్స్ ఇలాగే వున్నాయి. ఈ రాత్రికి ఇక జాగారమే. పైగా ఈ టెన్షను. ఇదివరకు ఫోను చేసినవాళ్ళు "శివానితో డేట్ కావాలి" అని ఒకడంటే "శివాని ఫ్రీయేమో కనుక్కొందామని" అని మరొకడన్నాడు.

రెండు రోజుల నుంచి బ్లాంక్ కాల్స్ వస్తున్నాయి. "హలో", "హలో" అని ఎంత అరచినా అవతలివాళ్ళు మాట్లాడరు. ఈ రోజేమో ఈ చిత్రమైన ఫోన్లు.

శివాని ఇప్పుడిప్పుడే డిగ్రీ కోర్సులో చేరింది. కంప్యూటర్‌లో స్పెషల్ కోర్సు చేస్తానంటే సరేనని బోలెడు ఫీజు కట్టి ప్రైవేటు ఇన్‌స్టిట్యూషన్లో చేర్పించారు. ఇటూ అటూ స్వేచ్ఛగా తిరుగుతున్నందున స్నేహాలు కలిశాయేమో అనుకోటానికైనా ఇవేమి స్నేహాలు! అందులో మగవాళ్ళు ఫోన్లు చేసి ఈ ఆరాలు తియ్యటమేమిటి?

ఉదయం పేపరు చదువుకొంటున్నప్పుడు శివాని కాలేజీకి వెళ్ళటానికి తయారవటం గమనించాడు గంగాధరం.

"శివానీ, ఇలారా" అని పిలిచాడు.

శివాని బెదురుతూ, బెదురుతూ వచ్చింది. ఆమె గుండె దడ దడ కొట్టుకొంటోంది. అర్ధరాత్రి ఫోన్ల గురించే నాన్నగారు అడుగుతారని తనకు తెలుసు. ఎందుకంటే మొన్నా అటు మొన్నా వచ్చిన బ్లాంక్ కాల్స్ తను తీస్తే మాత్రం ఆ గొంతులు ఏవేవో వెకిలిగా మాట్లాడేవి. వాళ్ళెవరో, తనకెందుకు ఫోన్ చేస్తున్నారో, ఎవరితో ఈ బాధ పంచుకోవాలో తెలీక సతమతమవుతోంది ఈ అమ్మాయి.

గంగాధరం కూతురివైపు చూసి "కాలేజీకి వెళ్తున్నావా?" అని అడిగాడు.

అవునని తల ఊపింది.

"శ్రద్ధగా చదువుకొంటున్నావా?"

"బాగానే చదువుతున్నాను నాన్నగారూ."

"సాయంకాలం కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ నుండి వచ్చేప్పుడు బస్సుదొరుకుతోందా? మరీ ఆలస్యం కావటం లేదు కదా!"

"ఏడు గంటలకంతా క్లాసయిపోతుంది. ఇన్‌స్టిట్యూట్ పక్కనే బస్‌స్టాపు. ఐదు నిమిషాలలోపుగా బస్సు దొరుకుతుంది."

"క్లాసులెగ్గొట్టి ఫ్రెండ్స్‌తో ఇటూ అటూ జల్సాలు చెయ్యటం లేదు కదా?" శివానిని పరిశీలనగా చూస్తూ అడిగాడు గంగాధరం.

"లేదు లేదు అటువంటిదేమీ లేదు" కాస్త తడబడుతూ సమాధానమిచ్చింది.

"చూడు ఎవరైనా నిన్ను అల్లరిపెట్టుంటే నాకు చెప్పు. భయపడకు. అంతేగాని మా కన్నులు గప్పి నువ్వేమయినా పనికిరాని పనులు చేస్తే ఊర్కొనేది లేదు. అర్థమైందా?" గట్టిగా చెప్పాడు.

శివాని తల ఊపుతూ కళ్ళ నీళ్ళు ఆపుకొంటూ అక్కడి నుంచి వెళ్ళబోయింది.

"శివానీ..."

తను ఆగింది.

"శివానీ రాత్రి మూడుసార్లు ఫోనొచ్చింది నీ కోసం. ఒకటి ఫారిన్ కాల్ అనుకొన్నాను. ఎవరికైనా ఫోను నంబరిచ్చావా?"

"లేదు నాన్నగారూ. నా క్లాస్‌మేట్సుకి, అందులో క్లోజ్ ఫ్రెండ్స్‌కే నా నంబరు తెలుసు."

"ఆ ఫ్రెండ్సులో బాయ్స్ కూడా వున్నారా?"

"కొద్దిగా పరిచయమే. అంత ఫ్రెండ్సు ఎవరూ లేరు."

"ఇన్‌స్టిట్యూట్‌లో..."

"అక్కడా అంతే. హలో అంటే హలో అనటమే. కాకపోయినా కంప్యూటరు మాకు రెండు గంటలు మాత్రమే యిస్తారు. ఆ సమయం ఎవరూ వేస్ట్ చేసుకోరు."

"సరే నువ్వు కాలేజీకి వెళ్ళు."

గంగాధరం ఆ ఫోన్ కాల్స్ గురించి అట్టే ఆలోచించలేదు. ఎవరో వెర్రి వెధవలు, పనీ పాటా లేని వాళ్ళ పని అని అనుకొన్నాడు.

ఆ సాయంత్రం గంగాధరం ఆఫీసునుండి ఇంటికి వచ్చేసరికి సావిత్రి కొంచెం చికాగ్గా కనిపించింది.

"ఈ రోజు ఆఫీసుకు వెళ్ళలేదా సావిత్రీ" అని అడిగాడు గంగాధరం. ఆమె ఒక యన్.జి.ఓ. లో పనిచేస్తోంది.

"ఉదయం ఒకపూట వెళ్ళి వచ్చేశాను. మాది ఇప్పుడు లిటరసీ ప్రోగ్రామ్ కదా. ఇక్కడే మురికివాడల్లో చదువు చెప్పటం. గ్రూపులందరికీ చెప్పవలసింది చెప్పి, సూచనలిచ్చి నేను వచ్చేశాను. మీరు మొహం కడుక్కొని బట్టలు మార్చుకోండి టీ తెస్తాను."

ఇద్దరూ టీ తాగుతూ, బిస్కెట్లు తింటూ ఏవేవో మాట్లాడుకొన్నారు. రాజకీయాలు, వార్తలు, ఆఫీసు విషయాలు... ఇదంతా మామూలే. అయినా సావిత్రి ఏదో ఆలోచిస్తున్నట్టు అనిపించింది గంగాధరానికి.

"దేని గురించో వర్రీగా వున్నావు. ఏమిటది?" అని సూటిగా అడిగాడు.

"శివాని గురించి" అంది సావిత్రి.

"ఏమయింది శివానీకి?"

"ఆ ఫోన్ కాల్స్..."

"రాత్రి సంగతా? ఎవరో తుంటరి వెధవలు చేసుంటారు. ఈ రాత్రికీ అలాంటి కాల్స్ వస్తే పోలీసు రిపోర్టిద్దాం."

సావిత్రి కాదన్నట్టు తల ఊపింది. "ఇప్పటికే రెండు మూడు రోజుల్నుండి కాల్స్ వస్తున్నాయి. మీరు బ్లాంక్ కాల్స్ అన్నారు. కాని శివాని ఫోన్లో మెల్లగా మాట్లాడటం విన్నాను. తనను అడిగితే 'రాంగ్ నంబర్' అని రెండుసార్లు చెప్పింది. ఈ రోజు మధ్యాహ్నం ఒకసారి ఫోన్ మోగింది. నేను తీశాను. అవతలివాడు బడబడా వాగేస్తున్నాడు. వెకిలిగా నవ్వుతున్నాడు. నేను శివానీ అనుకొని మాట్లాడేస్తున్నాడు. చాలా అసహ్యం వేసింది. మీటింగ్ ప్లేసు, హోటలు అని కూడా అన్నాడు."

గంగాధరం అవాక్కయ్యాడు. ఏం చెయ్యాలో తోచలేదు.

“నువ్వేమంటావు సావిత్రీ! శివానీ బాయ్‌ఫ్రెండ్సు ఇలా చేస్తున్నారా?”

“చెప్పలేను. కాని బాయ్‌ఫ్రెండ్సు ఇంత వెకిలిగా, బూతుగా వుంటారా? మన శివాని అటువంటి వాళ్ళతో స్నేహం చేస్తుందా? మనందరం కాలేజీలలో కలిసే చదువుకొన్నాం. పరిచయాలు, స్నేహాలు... ఎంత డిగ్నిటీ వుండేది. వెకిలివాళ్ళు లేరని కాదు. కామెంట్స్ చెయ్యలేదని కాదు. బూతులు మాట్లాడేవారు కాదనీ అనటం లేదు. కానీ ఇదంతా సమాజంలో ఆడపిల్లలు నిత్యమూ ఎదుర్కొనే సమస్యలే. వాళ్ళ మాటలకు చేతలకు ఎంతో బాధ కలిగేది. అవమానమనిపించేది. ఇతరులు చూస్తే ఏమనుకొంటారో అనే భయమూ వుండేది. అయినా తొణక్కుండా వుండేవాళ్ళం. ఏమీ జరగనట్టే నడుచుకొనేవాళ్ళం. కాని వాళ్ళను మాత్రం మనసులోనే తిట్టుకొనేవాళ్ళం. అసహ్యించుకొనేవాళ్ళం. చీడపురుగుల్లా చూసేవాళ్ళం.”

“ఈ చెదలు సమాజంలో ఎప్పుడూ వుంటాయి సావిత్రీ. ఏదో ఒక మార్గంలో వాటిని దులిపెయ్యటమే మంచిది. ఈ రాత్రికి చూద్దాం. ఆ కాల్స్ మళ్ళీ వస్తే పోలీసు రిపోర్టు ఇవ్వాల్సిందే. నువ్వు కూడా శివానీని మెల్లగా కనుక్కో.”

సావిత్రి సరేనని తల ఊపింది. తనకు మాత్రం చదువుకొనే ఆడపిల్లల సమస్యలు తెలీవా?

ప్రేమలేఖలు, అపవాదులు, ఫోటోల గారడీలు, బెదిరింపులు... పాపం ఒకరికి చెప్పుకోలేక ఆ బాధలు భరించలేక ఎంత యాతన పడతారు. ఎవరికి ఏమి చెప్పినా ముందు వీళ్ళనే అనుమానిస్తారు.

“ఇంతమంది ఆడపిల్లలుండగా నీ విషయంలోనే ఎందుకు జరిగింది” అంటారు. ఇక అమ్మా నాన్నల సంగతా... “వెలగబెట్టిన చదువు చాలు ఇక ఇంట్లో కూర్చో” అని అంటారు. టీన్ ఏజ్‌లో, ముఖ్యంగా చదువుకొంటున్న ఆడపిల్లలు, ఎంత దుఃఖం అనుభవిస్తారో, ఎన్ని కన్నీళ్ళు కారుస్తారో, చేయని తప్పుకు ఎంత శిక్ష అనుభవిస్తారో, సమాజానికి భయపడి ఎంత ఒదిగి ఒదిగి జీవిస్తారో, దీనివల్ల వాళ్ళ వ్యక్తిత్వం ఎంతగా కుంచించుకుపోతుందో చాలా మందికి తెలీదు.

శివానీని అనవసరమైన క్షోభకు గురిచేసేపని పొరపాటున కూడా చెయ్యనని సావిత్రి అనుకొంది. శివాని తప్పుదారిలో వున్నా తనకు నచ్చజెప్పి మంచీ చెడ్డా ఆలోచించేలా చేస్తుంది కానీ మానసికంగా శిక్షించదు.

ఆ రాత్రి మళ్ళీ కాల్స్ వచ్చాయి. ఒకసారి గంగాధరం, మరోసారి సావిత్రి తీశారు. మూడోసారి శివానీని తీయమన్నారు. ఆ ఫోనులో మాట్లాడినంతసేపూ శివాని, “నాకు తెలీదు, నాతో మాట్లాడకు, నేను ఇన్‌ఫర్మేషన్ ఇవ్వలేదు” అంటూ

వచ్చే ఏడుపును ఆపుకొంటోంది. ఆ రాత్రి ఫోన్ కనెక్షన్ తీసేసి పడుకొన్నారు. అయినా ఎవరూ నిద్రపోలేదు.

మరుసటి ఉదయం సావిత్రి, గంగాధరం ఇద్దరూ అడిగారు "ఏమిటమ్మా ఈ గొడవ?" అని.

"నాకు తెలీదు" అంది ఆ అమ్మాయి ఏడవటానికి సిద్ధంగా వున్నట్లు.

"రాత్రి ఫోనులో అవతలివాడు ఏమన్నాడు?"

"నీ సమాచారం వెబ్‌సైట్‌లో చూశాను. నీకు ఫ్రెండు కావాలి కదా. నీవిచ్చిన వివరాలు బాగున్నాయి. నా వివరాలు కావాలా... యిలా మాట్లాడాడు నాన్నా. నాకేం అర్థం కాలేదు. ఫోను కట్ చేశాను."

"సరే సరే... దాని గురించి ఆలోచించకు. మామూలుగా కాలేజీకి వెళ్ళు. నీ ఫ్రెండ్సు కాని, పరిచితులుగాని అదోవిధంగా ప్రవర్తిస్తే గమనించు."

సరే అని తల ఊపి కాలేజీకి వెళ్ళటానికి సిద్ధమయింది శివాని. ఆ అమ్మాయికి అసలు కాలేజీకి వెళ్ళాలనే లేదు. ఎవరైనా తనను అలరించి, దగ్గరకు చేర్చుకొని కన్నీళ్ళు తుడిస్తే ఎంత బాగుండుననిపిస్తోంది. ఎవరి ఒడిలోనైనా తలపెట్టుకొని భోరున ఏడవాలని వుంది. తను చేయని నేరానికి ఈ శిక్ష ఏమిటో తనకు తెలియటం లేదు.

గంగాధరం నేరుగా పోలీసు స్టేషన్‌కు వెళ్ళి కంప్లెయింట్ ఇచ్చాడు. వాళ్ళు ఆరాలు తియ్యటం కూడా గంగాధరానికి చికాకనిపించింది.

"మీ ఇంట్లో ఆడవాళ్ళున్నారా? వయసులో వున్న వాళ్ళేనా? వాళ్లకు ఎవరితోనైనా స్నేహాలున్నాయా? చూడండి చాలా వరకు తెలిసిన వాళ్ళే ఇంత చనువుగా కాల్స్ చేస్తారు. ఇతరులకు తెలీకూడదని జాగ్రత్తగా వుంటారు. అందుకే బ్లాంక్ కాల్స్. మీ పిల్లలు మీకు అన్ని విషయాలూ చెపుతారని అనుకోకూడదు. అయినా మీ ఫోను టాప్ చేస్తాం చూద్దాం ఎక్కడి నుంచి కాల్స్ వస్తున్నాయో?"

లేనిపోని అనుమానాలు సృష్టిస్తున్నారని గంగాధరం మనసులోనే మథనపడ్డాడు. అయినా పోలీసువాళ్ళ తప్పేముంది. నిత్యమూ రకరకాల నేరస్థులతో, క్రిమినల్స్‌తో, రాటు తేలిన దుర్మార్గులతో వ్యవహరించేవారు ఈ విధంగా ఆలోచించక తప్పదులే అని తనకు తాను నచ్చజెప్పుకొన్నాడు.

రెండు మూడు రోజులు గడచిపోయాయి. నాలుగో రోజు పోలీసు స్టేషన్‌నుండి ఫోన్ వచ్చింది. శివానిని కూడా వెంటబెట్టుకు రమ్మన్నారు. ఏమయిందోనని కంగారుపడుతూ గంగాధరం శివానితోపాటు వెళ్ళాడు. "ఏ విషయమూ ఫోన్

చేయండి... నేనింట్లోనే వుంటాను" అని వాళ్ళు వెళ్ళేముందు సావిత్రి చెప్పింది.

పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టరు వీళ్ళను కూర్చోమని కానిస్టేబుల్‌కు ఏదో చెప్పాడు. కానిస్టేబుల్ లోపలికి వెళ్ళి ఒక అబ్బాయిని వెంటపెట్టుకొని వచ్చాడు. శివానీ తలెత్తి చూసి ఆశ్చర్యపోయింది.

"ఈ అబ్బాయి నీకు తెలుసా అమ్మా" అని అడిగాడు ఇన్‌స్పెక్టరు.

తల ఊపింది. "కామేశ్. నాతోపాటు ఇన్‌స్టిట్యూట్‌లో కంప్యూటర్స్ నేర్చుకొంటున్నాడు. నేను వాడే కంప్యూటరే నా తరువాత తను వాడుతాడు. ఆ విధంగా పరిచయం."

"ఈ అబ్బాయి ఏం చేశాడో తెలుసాండీ" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

"ఏం చేశాడు?" అని అడిగాడు గంగాధరం.

"ఏం నాయనా నువ్వు చెపుతావా నన్ను చెప్పమంటావా?" అని గద్దించినట్లు అడిగాడు ఇన్‌స్పెక్టరు.

ఆ అబ్బాయి తల వంచుకొన్నాడు.

"వీడు మీ అమ్మాయి వివరాలు, ఫోన్ నెంబరు వెబ్‌సైట్‌లో ఇచ్చాడు. పైగా డిస్కోలు, డాన్సులు సరదా అయినట్లు, మరెన్నో హాబీలున్నట్టు, బాయ్స్ కంపెనీ తనకు చాలా ఇష్టమని, ఇష్టమున్న వాళ్ళు కాంటాక్ట్ చేయవచ్చని అన్నాడు. దానితో రకరకాల వాళ్ళు సమయం కాని సమయంలో ఫోన్లు చెయ్యటం ప్రారంభించారు."

గంగాధరానికి ఒళ్ళు మండుకొచ్చింది. వాణ్ణి తన్నటానికా అన్నట్టు, పైకి లేచాడు. ఇన్‌స్పెక్టరు అతణ్ణి చేత్తో వారిస్తూ "వీడి సంగతి మేము చూసుకొంటాం లెండి. వాళ్ళ తల్లిదండ్రులకు కూడా కబురంపాం. వస్తూ వుంటారు. ఇంతకూ మీరు కేసు పెట్టాలనుకొంటున్నారా లేక నాలుగు తగల్నిచ్చి ఇంటికి పంపమంటారా చెప్పండి" అని అడిగాడు.

"కేసే పెట్టండి ఇలాంటి వాళ్ళకు బుద్ధి రావాలంటే ఈ క్రిమినల్స్‌కు శిక్ష పడాల్సిందే" అన్నాడు గంగాధరం.

శివాని మౌనంగా కూర్చున్నా మనసులో చాలా కోపంగా వుంది. ఆ అబ్బాయిని సాగదీసి ఒకటిస్తే బాగుండు ననిపించింది. తను పడిన యాతనకు, తాను కార్చిన కన్నీళ్ళకు, తనకు జరిగిన అవమానానికి ఇతనికి ఏ శిక్ష వేస్తే సరిపోతుంది అనుకొంది. తన తల్లిదండ్రుల మనస్సులోనే అనుమానా లొచ్చాయి. తానేం చేసిందని తనింత చిత్ర హింసకు గురికావాలి? "నువ్వు అసలెవరివి? నా జీవితంతో నీకు సంబంధ మేమిటి?" అని నిలదీయాలనుంది. కాని ఆమెది మృదు స్వభావం, సహజంగా

సౌమ్యురాలు. ఎప్పుడూ గట్టిగా వాదించి ఎరుగదు. ఎవరేమన్నా మనసులో బాధపడుతుందే గాని తిరిగి జవాబు చెప్పలేదు. ఆమెకు కోపం వచ్చినా బాధ కలిగినా వచ్చేవి కన్నీళ్ళే. అందుకే ఇప్పుడు ఆమె కళ్ళలో నుండి నీళ్ళు జలజలా రాలిపోతున్నాయి. మొహం పక్కకు తిప్పి చాటుగా రుమాలుతో తుడుచుకుంటోంది.

ఇన్‌స్పెక్టరు మాట్లాడుతూనే వున్నాడు. "మీరన్నమాట నిజమే గాని ఈ కేసులింత త్వరగా తెమలవు సార్. పదిసార్లు కోర్టు చుట్టూ తిరగాలి. వీళ్ళకు బెయిలూ ఇట్టే దొరికిపోతుంది."

ఇంతలో కామేశ్ తల్లిదండ్రులు వచ్చారు. "ఏమయింది, ఏమయింది" అంటూ ఇన్‌స్పెక్టరు వివరాలు చెపుతున్నాడు. ఇంతలో కామేశ్ తల్లి లేచి కామేశ్ చెంపలు ఛెళ్ళు ఛెళ్ళుమని వాయించింది. "నీకు ఇంట్లో ఒక చెల్లెలుందని జ్ఞానమైనా లేదా? ఇందుకేనా నువ్వు కంప్యూటర్ నేర్చుకొంది? ఇన్‌స్పెక్టరు గారూ వీడికి ఏమి శిక్ష విధిస్తారో విధించండి. మేము అడ్డు చెప్పం. ఆఖరికి ఉరి తీసినా సరే" అంది కోపంగా.

కామేశ్ తండ్రి ఆమెను శాంత పరుస్తూ "ఊరుకో" అని గంగాధరానికి క్షమాపణ చెప్పుకొన్నాడు.

"చిన్న వయసులో పిల్లలు ఎక్కడెక్కడ తిరుగుతారో, ఏం చేస్తారో మనకు తెలీదు. మా వాడు చేసింది పెద్ద తప్పే. కొత్తగా నేర్చుకొన్న విద్యను వాడీ విధంగా ప్రదర్శించుకొన్నాడు. దీని ఫలితాలు ఆలోచించి వుండడు. క్షమించండి. ఇప్పుడు కోర్టులూ, కేసులూ అంటే వాడి భవిష్యత్తు పాడవుతుంది" అని ప్రాధేయపడ్డాడు. "మీ బిడ్డే తప్పు చేశాడనుకొని వాడిని కొట్టండి. తిట్టండి. బుద్ధిచెప్పండి. కానీ క్షమించండి. కేసు పెట్టకండి. అంకుల్‌ను క్షమాపణ కోరు సే సారీ" అని కొడుకుతో అన్నాడు ఆయన.

కామేశ్ మొహం అప్పటికే ఎర్రబడింది. తల వంచుకొని వచ్చి గంగాధరం పాదాలు తాకాడు. "క్షమించండి అంకుల్. ఏదో తమాషాగా చేశాను. ఇది ఇంత సీరియస్ అవుతుందనుకోలేదు. ఐ యామ్ వెరీ వెరీ సారీ శివానీ. ప్లీజ్ పార్డన్ మీ" అని చేతులు జోడించాడు.

శివాని ఎర్రబడ్డ కళ్ళను పైకెత్తి చూసింది. వాటిలో జ్వలిస్తున్న బాధ, "ఇదెక్కడి న్యాయం?" అన్న ప్రశ్న మాత్రం మిగిలాయి.

భూమిక మాసపత్రిక